# గొంగలి పురుగు

"ఎట్ల నాయుడు, కొంచెం దయ జూడు మామింద" మాటల్లో అభ్యర్థన నారాయణ హృదయాంతరాల్లోంచి వస్తోంది.

"నేనేమన్నా దేవుడ్నా, దయజూసేదానికి. అయినా నువ్వొచ్చి అడిగితే ఏ పొద్దు నిన్ను బీటికి పంపినాను చెప్పు. బొత్తిగా నా దగ్గిర లేదంటే బేంకులో సొత్తులు కొదవపెట్టిగూడా నీకు దుడ్డు ఇచ్చినా ఎన్నోతూర్లు. 'నాక్కు' చెనిక్కాయలు, వడ్లు మూటలు మూటలు ఇచ్చినా. అన్నేయం మనిసినయితే అయ్యన్నీ చేస్తానంటావా? ఉండూరోళ్లంగదా, పద్దన్నే లేస్తానే మొగాలు చూసుకోవద్దా?" అంటూ ఎదురు ప్రశ్నించాడు నాయుడు.

"అవసరంలో ఆదుకొంటావనే కదా నాయుడు, నీ దగ్గరకొచ్చింది" అన్నాడు నారాయణ అతనిమాటలు అతనికే అప్పగిస్తున్నట్లుగా.

"అవసరమని పీకలమిందికి వచ్చి కూచ్చుంటారు. పోనీలే పాపం అని సాయం చేసినామంటే, తిరిగి యిచ్చేటప్పుడు నేను అన్నేయం మనిషినంటారు. మీ పక్కింటి రెడ్డెప్ప జూడు ఏం చేసినాడో. నిరుడు 'నాక్కు' రెండు మూటల కాయలు తీసుకొన్నేడు. పండినోటియి నాలుగు మూటలేనంట. అయ్యి నాకు యిచ్చేటప్పుడు ఎన్నెన్ని మాటలన్నేరో మొగుడూ పెళ్లాలు. పంట సరిగా రాకపోతే అందుకు నేనేం జేయాల. వానలు బాగొచ్చి అదునుకు అన్నీ సక్రమంగా జరిగి మూటకు ఇరవై మూటల కాయలయింటే నాకేమన్నా ఎక్కువ ఇచ్చిందురా.. నువ్వే చెప్పు. ముందనుకున్న మాటకాడికి మూటకు మూటే గదా ఇస్తారు" అన్నాడు నాయుడు తను అన్యాయం చేయడం లేదన్నట్లుగా.

ఇంతలో నాయుడు భార్య పిలవడంతో లోపలకు వెళ్లాడు. నారాయణ అక్కడికి వచ్చి అప్పటికి అర్ధగంట దాటింది. నాయుడి ఇంటిముందు అరుగుమీద కూర్చోనున్నాడు. పొడవూ పొట్టీకాని దేహం. వయసు యాభైకి అటూయిటుగా ఉంటుంది. చామనచాయ. కోలముఖం. కోరమీసం. అందులో అక్కడక్కడా తెల్లటి వెంట్రుకలు. ఆముదం పెట్టి నున్నగా దువ్వినతల. తెల్లపంచెమీద పొడవు చేతులచొక్కా... భుజం పైన మాసీ మాయని టర్కీటవలు. నాయుడి మాటలు నారాయణలో పాత అనుభవాలను ఎలకలా లోడసాగాయి. లెక్కలేనన్నిసార్లు గతం గుర్తొచ్చి అతడ్ని బాధిస్తుంటుంది. ఇప్పుడు కూడా గుర్తుకు రాసాగింది.

"వడ్లు సుమారిగా అయినట్లుండాయే..." అనే మాటలు విన్పించడంతో ఉలికిపాటుగా తలెత్తి చూశాడు నారాయణ. ఎదురుగా నాయుడు చేతిలో సిగరెట్, ముఖంలో నవ్వు, వెంట తనగుమాస్తా బుజ్జాసాబ్‌తో. వారిని చూడగానే గ్రహణం నాటి చంద్రునిలా నారాయణ ముఖం వాడిపోయింది.

"ఏం సుమారన్నా. చూపలకేమో పదిమూటలు పైన్నే అయినట్లుండాయి. అంతా జొల్లు, తూర్పు బట్టేలకు అయ్యి ఎల్లినాయి" అంది నారాయణ భార్య లక్ష్మమ్మ.

"ఆ.. దాన్దేముందిలేమ్మా.. ఎప్పుడూ మనకు లాబమే ఉండాలంటే అవుతుందా. నష్టమూ లాబమూ వస్తాంటాయి. రేయ్.. నువ్వు ఆ సంచలకు పొయ్యిరా.. నేను వస్తా నారాయణా. మా ఇంటికి నీ సంచల్లో తెచ్చి ఆడ కుమ్మరించి మల్లా మా సంచల్లో ఎందుకు పోసేది అని, వీన్ని ఎనకంటి తీసుకోనొస్తి" అంటూ మరో మాటకు అవకాశం యివ్వకుండా నారాయణ పిలుస్తున్నా పనుందంటూ వెళ్లిపోయాడు నాయుడు.

ఆ సంవత్సరం వర్షాలు బాగా పడడంతో చెరువులన్నీ నిండిపోయాయి. నారాయణకు చేను ఎనిమిది ఎకరాలుంది. మడిలేదు. నాయుడు బావమరిదిది కోరుకు చేశాడు. వచ్చిన పంటలో చెరిసగం. వడ్లు నాయుడు దగ్గర ఒక బస్తా నాక్కు తీసుకున్నాడు. బస్తాకు బస్తా. రెండు బస్తాలు నాయుడుకు పాయ. తాలుగింజలు పోను నికరంగా వడ్లు తేలింది ఐదుబస్తాలే. అందులో సగం నాయుడు బామ్మర్దికి పోగా.. మిగిలిన అరబస్తా చూసి నారాయణ ప్రాణం ఉండీ లేనట్లయింది. నారు పోసినప్పటినుంచి రేయింపగలు అతన్తోపాటు కష్టపడిన లక్ష్మమ్మ మనసు నిప్పుల్లో పెట్టి కాల్చినట్లయింది. ఏమీ చేయలేని నిస్సహాయత ఆమెను అశక్తురాలిని చేసింది.

"ఏం నారాయణ.. ఏమాలోచిస్తాండావు" అంటూ వచ్చిన నాయుడ్ని చూసి నారాయణ ఆలోచనలకు అంతరాయం కల్గింది.

నాయుడు పొడగరి. ఎర్రటి శరీరం. వంటిమీద ఎప్పుడూ మాయని మల్లెపువ్వులాంటి బట్టలు, లావు మీసం, రెండు చేతులకు కలిపి నాలుగు ఉంగరాలు. ఎప్పుడూ సిగరెట్ తాగుతుండడంతో నల్లబడ్డ పెదాలు. మంచి తిండి తింటుండడంతో బలిసిన శరీరం.

"మా బతుకులకు వేరే ఆలోచనలు ఏముంటాయి" అన్నాడు నారాయణ.

నారాయణ పక్కన్నే అరుగు మీద కూర్చుని బ్రేవ్‌మని తేన్చాడు నాయుడు.

"మీ కొడుక్కు సంబంధం చూడకూడదా" అన్నాడు.

"ఆఁ.... ఇప్పుడు అదొగటే తక్కువ. వాడి వయసెంతనీ. సరీగామూతిమింద మీసం గూడా మొల్లేదే. ఇంగా పెండ్లి కావాల్సిన కూతురుండాది. మా బతుకులు పిల్లలకు పెండ్లిండ్లు చేసేటియిగా ఉండాయా? ఎవసాయాన్ని నమ్ముకొని కూటికి గుడ్డకు జరక్క బాదపడతాండామే" తన బాధలు వివరించాడు నారాయణ.

"కూడు గుడ్డా లేదనుకొంటే పెరిగే వయసు ఆగతాదా. అప్పో సప్పో చేసి, కాళ్లో చేతులో పట్టి బిడ్డలకు పెండ్లిండ్లు జేయాల. నా కూతుర్ని జూడు. నీకూతురి వయసే గదా. రెండు సంవత్సరాలు జాస్తి ఉంటాయేమో. నేను పెండ్లి చేయలా. ఎన్ని అగసాట్లు పడితి. పరపతులు యిచ్చినోటియి టయానికి అందలా. వియ్యంకులోల్ల దగ్గర పరువు పోతాదనుకొంటి, కన్నగసాట్లు పడి ఎల్లదీసేస్తిననుకో. బిడ్డల కనుక్కొన్నేక తప్పతాయా తిప్పలు" అన్నాడు నాయుడు తనేదో చాలా బాధలు పడి కూతురి పెండ్లి చేశానన్నట్లుగా.

నారాయణకు అతని మాటలు గుండెల్లో గుచ్చుకొన్నట్లయ్యాయి. పుష్పవతి అయి రెండేండ్లు దాటిన కూతురు. రెండుపదులు దాటిన కొడుకు అతని కండ్లముందు మెదిలారు. కూతురుకు కనీసం మంచి బట్టలు కూడా తీసియ్యలేని తన అసహాయతకు అసహ్యామేసింది. పెళ్లి విషయం తల్చుకుంటే మరింత భయమేసింది. నాయుడు కూతురు పెండ్లి చాలా ఘనంగా చేశాడు. తమ పల్లెవాళ్లనే కాకుండా చుట్టుపక్కల చాలా పల్లెలోల్లను జలగలా పీడిస్తున్నాడు నాయుడు. డబ్బు అవసరానికి యిచ్చి ఆదుకొన్నట్లు నటిస్తాడు. అదునుచూసి పీకలమీద కూర్చుని ఉన్నదంతా ఊడలాక్కుంటాడు. లక్షలకు లక్షలు పరపతులిచ్చాడు. తన ఒక్కగానొక్క కూతురికేం ఖర్మ. ఉంటే ఇంకా ఐదుగురు కూతుండ్లకయినా అంతే ఘనంగా పెండ్లి చేయగల తాహతు గలవాడు. ఏందీయన. తనొచ్చిన విషయాన్ని వదిలేసి ఏందేందో మాట్లాడతాండాడే, అనుకొని. "నిజమే. మేంగూడా చూసినాం కదా.. నువ్వు పడిన బాధలు. ఒంటిచేత్తోనే కార్యమంతా చేసినావు. ఎట్లయితేనేం. నెత్తి బరువు తగ్గించుకొన్నేవు. మేము ఎప్పుడు తగ్గించుకొంటామో ఏమో. ఆ గొడవలన్నీ ఇప్పుడెందుకు గానీ... నేనొచ్చిన విషయం చూడు నాయుడు" అన్నాడు నారాయణ నసుగుతు.

"నీ కెట్లచెప్పేది నారాయణా నేను. ఉన్నెబ్బుడు ఇస్తాంటి. ఇప్పుడు యాడుండాయి. నా దగ్గరున్ని కాయలన్ని అయిపోయినాయే. గవుర్మెంటోళ్లు సబ్సిడీకి కాయలు యిస్తాండారంటనే పొయ్యి తెచ్చుకోగూడదా" అంటూ ఉచిత సలహా ఇచ్చాడు నాయుడు.

"అయ్యి మాకేడ యిస్తారు నాయుడు. పట్టాలుండే వాళ్లకే గదా. మేం కొండకింద చేను ఏరపించి సాగు చేయబట్టి ఆరు సంవత్సరాలవుతాంది. యింతవరకూ మండలమోల్లు పట్టా ఈలా. నీగ్గూడా ఎన్నోసార్లు చెప్పినా ఎమ్మార్వోతో మాట్లాడి పట్టా యిప్పించమని. యిప్పిస్తే కదా" అన్నాడు నారాయణ.

ఆ సంగతి నాయుడికి తెలిసే సబ్సిడీ ప్రస్తావన తెచ్చాడు. నారాయణకు తనుతప్ప వేరే మార్గంలేదు అని తెలియజేయడానికి అట్లా మాట్లాడాడు.

"ఓ... మర్చే పోతాండా నారాయణ. అట్లా పన్లన్నీ పనులకాలంలో కావు. ఎండాకాలం అబ్బుడయితే వాళ్లొచ్చి చూసేదానిగ్గూడా బాగుంటాది. రేపుసారికి పట్టా చేపిస్తాలే. నేనొస్తా నారాయణా, పీలేరుకు బోవాల." అన్నాడు నాయుడు.

నారాయణ ముఖంలో కలవరం గమనించాడు నాయుడు.

"నేనొచ్చిన పని" అన్నాడు బేలగా.

"నువ్వు చెనిక్కాయలు కావాలన్నేవు గదా. మాయ్యి ఒక్క బుడతగూడా లేవు నారాయణా. మా బామ్మర్ది నెలముందు లోడుకయ్యి మిగిలిన పద్దైదుమూట్ల కాయలు ఈడేసి పొయ్యినాడు" అన్నాడు నాయుడు నారాయణలో ఆశలు రేపుతూ.

ఆ మాటలు వింటూనే నారాయణ ముఖంలో కళ. కళ్లలో కాంతి తళుక్కుమంది. అది పసిగట్టిన నాయుడు. "అయ్యి ఎవురికీ ఈయద్దని చెప్పినాడు" అన్నాడు తాపీగా మరో సిగరెట్ వెలిగిస్తూ.

"అట్లంటే ఎట్ల. నిన్నే నమ్మకోనుండాము. ఇంట్లో ఒగరూపాయి దుడ్డుగానీ, ఒక మూట కాయలుగానీ లేవు. నాకు పదిమూటలు ఈ నాయుడు" అన్నాడు నారాయణ.

"అయ్యి నాయ్యి గాదే. అప్పంటాండావు. నాయ్యయితే నీ కడ్డమేముండాది. వాడు ఒప్పుకొంటాడో ఒప్పుకోడోనే." అన్నాడు విషయాన్ని నాన్చుతూ.

"నీకు పుణ్యముంటాదిప్పా. పంట వస్తానే దుడ్డు ఇచ్చేస్తా. ఒగరూపాయి గూడా పెట్టుకోను. మీ బామ్మర్ది నువ్వు చెప్తే యింటాడులే నాయుడు. పదిమూటలు ఈ సారికీ." అన్నాడు వేడికోలుగా నారాయణ.

"సరే నువ్వంతగా అడగతాండావు. వానిదగ్గిర నేను మాట పడాల్సి వస్తాది. అయినా యిస్తాలే. నిన్నూ పోగొట్టుకోలేను గదా. మూటకాయలు ఆరునూర్లు. ముందే చెప్తాండా." అన్నాడు నాయుడు చివరికంటా కాలిన సిగరెట్ దూరంగా విసిరేస్తూ.

"ఆరు నూర్లా!" అన్నాడు నారాయణ ఆశ్చర్యంగా.

"అవున్నారాయణా! వాడు చెప్పిన రేటది. అయ్యా వానికి అవసరమంట. అంతగా ఎవురయినా ముక్కె మయినోళ్లు వచ్చి అడిగితే ఆరునూర్లకు యిచ్చెయ్యి మామ అన్నేడు. నీ యిష్టమప్పా. తీసుకొంటె తీసుకో. లేకుంటే లేదు. బలవంతమేమీ లేదు. నాయ్యన్నా అయ్యింటే పదిరూపాయలు అట్లో ఇట్లో ఇచ్చిందు." అన్నాడు నాయుడు.

నారాయణకు తెలుసు అవి నాయుడి కాయలేనని. తమ అవసరాన్ని చూసి అతనా విధంగా మాట్లాడడం ఎన్నో సంవత్సరాలనుంచి చూస్తున్నాడు. అవసరంలో అన్యాయానికి గురయిన ప్రతిసారీ ఇంకెప్పుడూ అతని వద్దకు రాకూడదనుకొంటాడు. చాలీచాలని బతుకు తనచేత మళ్లీ మళ్లీ అదేపని చేయిస్తోంది. నారాయణ మనసులోనే లెక్కలేశాడు. బయట ఐదువందలా యాభైకి అమ్మతాండారు. ఆ లెక్కన పదిమూటలకు ఐదునూర్లు ఎక్కువ. పొరపాట్న ఆమాట అన్నే, ఆడే తెచ్చుకోపో అంటాడు. అక్కడ తెచ్చుకొనేంత డబ్బు తనవద్ద ఉంటే పద్దన్నే యితడ్ని యింతలా ప్రాధేయపడాల్సిన అవసరం ఏముంది. అవసరం తనది అనుకొన్నాడు.

"అట్లేకానీ నాయుడు. ఎప్పుడిస్తావు కాయలు" అన్నాడు నారాయణ.

"ఎప్పుడో ఎందుకు. బుజ్జుగాడు ఇంటికాన్నే ఉండాడు. మళ్లా వాడ్నీ పీలేరుకు పిల్చకపోవాల. ఇప్పుడే తీసుకోనిపో." అన్నాడు.

"సరే. ఇంటికి పొయ్యి మాకొడుకును పిల్చుకొని సంచులు ఎత్తుకోనొస్తా" అని ఇంటికి వెళ్లాడు నారాయణ.

పావుగంటకంతా నారాయణ కొడుకుతో పాటు సంచులను తీసుకొని వచ్చాడు.

అప్పటికే నాయుడు బుజ్జుసాబ్, నాయుడి ఇంటి వరండాలో సీలింగ్ కున్న కమ్మికి త్రాసు తగిలించి, త్రాసుకు ఒకవైపు పళ్లెంలో కాటాసంచిని ఉంచారు. అందులో బస్తాకు నలభైరెండు కేజీలయితే నలభైకేజీలే వేశారు.

సంచిని చూస్తూనే అనుమానంగా "రాళ్లు లేవా నాయుడు" అడిగాడు నారాయణ.

"లేవు నారాయణా. మా బామ్మర్ది తీసకపోయి రెండు వారాలయితాంది. ఇంగా ఈలా. యాడ్నో బయటూర్లో ఉండాయంట. తూకం నికరంగా నలభైరెండు కేజీలుండాది మూట. ఇంగా ఒక అరకేజీ అట్లే ఉంటాదిగానీ ఇట్ల ఉండదు. అంత అనుమానంగా ఉంటే చెప్పు. యాడన్నా తెమ్మంటా రాళ్లు." అన్నాడు నాయుడు.

"ఆc..ఆc.. అవసరం లేదు నాయుడు. ఊరికే అడిగినా." మెల్లగా అన్నాడు నారాయణ.

"తప్పుడు తూకమేస్తే పుట్టగతులుండవు నారాయణా. అంతగా నాకు నష్టం వచ్చేట్లయితే కొట్లాడి తీసుకొంటా మీదగ్గిర. మోసం చేసే యవ్వారం నాకు తెల్దు. అనుమానం ప్రాణసంకటం. ఎందుకు? తెమ్మంటానుండు రాళ్లు. రేయ్... బుజ్జా దిగివీధికి పోయి.." అంటున్న నాయుడు మాటలకు అడ్డొ వస్తూ.. "అక్కర్లేదు నాయుడు. ఆ మాత్రం నమ్మకం లేకుంటే ఎట్లా. తూకం వెయ్యమను" అన్నాడు నారాయణ.

నాయుడు సంచుల్లోని కాయలను బుజ్జుసాబ్, నారాయణలు కలిసి తమ సంచుల్లోకి మార్చడం, మార్చిన సంచిని బుజ్జుసాబ్ తీసుకొచ్చి పళ్లెంలో ఉంచడం జరుగుతోంది. అతను బస్తాను పళ్లెంలో ఉంచినప్పుడు చూసేవాళ్లకు తెలీని విధంగా బస్తాను కిందకు అదుముతాడు. అది కాటాకన్నా కిందకు దిగి నిదానంగా పైకిలేస్తుంది. ఈలోగా సరిపోయింది తూకం అని పక్కకు లాగేస్తాడు. కాటాలో తూకం కన్నా కనీసం కేజీ తక్కువ తూగుతాయి కాయలు. ఆ విధంగా రెండుబస్తాలు తూకం వేయడంతోనే నారాయణ కొడుకు సుధాకర్ గమనించాడు ఆ మోసాన్ని.

"అదో బుజ్జు అన్నా. నువ్వా మాదిర్తో సంచిని కిందికి అదిమిడిస్తే ఎప్పటికి అది పైకి లేసేది. అది లెయ్యకముందే నువ్వు పక్కకు లాగేస్తాండావే. తూకం రెండు కేజీలన్నా తగ్గతాంటింది." అన్నాడు బుజ్జుసాబ్‌ను నిలదీస్తున్నట్లుగా సుధాకర్.

"ఏమప్పా.. బళే హుషారుగా ఉండావే. ఎన్ని ఏండ్లగా నేనీపని జేస్తాండా. నేనేసే తూకంలో రిమార్కు ఉండనే ఉండదు." అంటూ తన ధోరణిలో కాయలు తూకం వేయసాగాడు బుజ్జాసాబు.

తూకంలో తేడా నారాయణకు తెలుస్తూనే ఉంది. కానీ గట్టిగా నిలదీయలేని నిస్పృహాయత. నాయుడు గుంభనంగా నువ్వుకొంటున్నాడు.

"ఒక్కోమూటకు ఎనిమిది డబ్బాలు తూగతాండాయి గదా నాయుడు. ఔటన్ తక్కువుండాది. నచ్చుపప్పు చానా ఉంటాది. ఇంగో రెండు మూటలు ఈ" అన్నాడు నారాయణ.

"ఇందాక పదిమూటలు చాలంటివి. ఇప్పుడు ఇంగా రెండు మూటలు అంటాండావు. ఎట్లనారాయణ నీతో" అన్నాడు నాయుడు.

"నీకు తెలీందేముంది నాయుడు. మామూలుగా మూటకు ఆరుడబ్బాల కాయలు తూగితే ఇరవై ఐదుశేర్ల గింజలు ఎల్లుతాయి. వాటిల్లో రెండుశేర్ల నచ్చుపప్పు పోతాది. మూటకు ఎనిమిది డబ్బాలు తూగితే ఇత్తనం గింజలు ఇరవై శేర్ల మించి రావు. ఎనిమిదెకరాల నేల. ఎకరాకు ముప్పై శేర్లు కావద్దా. ఇంగో రెండు మూటలు ఈ నాయుడు." అంటూ నారాయణ అదనపు రెండు బస్తాల అవసరాన్ని వివరించాడు.

"నీతో అంతా చిక్కే నారాయణ. మిగిలిన మూడు మూటలు ఎవరు తీసుకొంటారు చెప్పు." అని గొణుగుతూ మరో రెండు బస్తాలు తూకం వేయించాడు.

తూకం వేసిన సంచిని వేసినట్లుగానే సుధాకర్ దబ్బనం, దారం తీసుకొని మూతి కుడుతున్నాడు. అన్నీ కుట్టడం అయ్యింది. అక్కడి నుంచి ఇల్లు దగ్గరే కావడంతో సుధాకర్ ఒక్కో బస్తాను నెత్తిపై ఎత్తుకొని ఇంటిదగ్గర దించి రాసాగాడు.

"నారాయణా.. నోటు ఇప్పుడే రాసుకొందామా" అడిగాడు నాయుడు.

"సరే నాయుడు. ఇప్పుడే వస్తానుండు" అంటూ వెళ్లి భాస్కరరెడ్డి చిల్లర అంగడిలో ఒకతావు పేపరు, రూపాయి రెవిన్యూ స్టాంపు తీసుకొచ్చాడు.

తెల్లకాగితం మీద ఏడువేల రెండు వందలకు రాసి కింద రెవిన్యూ స్టాంపు అంటించి దానిమీద నారాయణ చేత సంతకం చేయించుకొన్నాడు నాయుడు.

"సాక్షి సంతకం." అన్నాడు నారాయణ.

"అయ్యంతా ఎందుకు నారాయణ. ఇదీ నాకయితే అవసరంలే. మా బామ్మర్ది కాయలుగదా. అందుకని. అంతగా వానికి సాక్షి సంతకం గావాలంటే నేను చేస్తాన్లే. నువ్వేం ఇల్లు పెరుక్కొని పోతాండావా?" అన్నాడు నాయుడు.

చివరిబస్తాను కూడా కొడుకు తీసుకెళ్లడంతో తనుకూడా ఇంటికి వెళ్లడానికి లేచాడు నారాయణ.

"ముందే చెప్తాండా నారాయణా. మళ్లా బాదపడద్దు. దీనికి నూటికి ఐదు రూపాయలు వడ్డీ." అన్నాడు నాయుడు.

నారాయణ నెత్తిమీద పిడుగు పడినంతగా కంపించాడు. లేచినవాడు మళ్లీ కూర్చున్నాడు.

"ఏంది నాయుడు. అంత అన్నేయం వడ్డీనా." అన్నాడు హీనస్వరంతో నారాయణ.

"నేనేం చేసేది చెప్పు. అయ్యి నాయ్యి కాదే. మా బామ్మర్దియి. వాడు చెప్పినట్లు గదా చెప్పాల. ఇంతకు ముందంతా నేను మూడు రూపాయలకే ఇస్తాన్నిండ్లా. ఇప్పుడుగూడా నాయ్యయింటే అట్లే ఇచ్చిందు. ఐదురూపాయల వడ్డీ అయినా అన్నేయం కాదు. పంట వచ్చేలకు ఆరునెల్లు అయితాదనుకో. మూటకాయలకు ఆర్నెల్లకు నూట ఎనబయ్యేగదా అయితాది. అదే నాక్కు కాయలు ఇస్తే మూటకు మూట ఈయద్దా. కొందురు నూటికి పదిరూపాయలు తీస్తాండారంట. మావోడే నయం" అంటూ తన బావమరిదిని వెనకేసుకొచ్చాడు నాయుడు.

నాయుడు ఎందుకు అంతగా వడ్డీ పెంచాడో నారాయణకు తెలుసు. గత సంవత్సరందాకా సురేంద్రరెడ్డి నాయుడుకు పోటీగా ఉండేవాడు. శనక్కాయలు కొనేదానికి, అవసరంలో సహాయం చేయడానికి, పేదరైతుల కష్టసుఖాలన్నింటికి అతను వెన్నంటి ఉండేవాడు. తనకు సాధ్యమయినంతవరకు ఆదుకొనేవాడు. అతను నూటికి రెండురూపాయల వడ్డీ తీస్తే, అప్పుడే నాయుడు మూడురూపాయలు తీసేవాడు. తన పిల్లల చదువులకని, పల్లెలో ఉన్న పొలం పుట్రా అమ్ముకొని సురేంద్రరెడ్డి టౌను చేరిపోయాడు. దాంతో సన్నాచిన్నా రైతులందరికీ నాయుడు దిక్కయ్యాడు. అది అలుసుగా తీసుకొని నాయుడు వాళ్ల అవసరంతో ఆడుకొంటున్నాడు. అదంతా నారాయణకు గుర్తు రావడంతో ఒక నిట్టూర్పు విడిచాడు.

"సరే నాయుడు, కానీండి" అని లేచి ఇల్లు చేరుకొన్నాడు. తను ఇల్లు చేరేప్పటికే వంటపని పూర్తిచేసిన భార్య లక్ష్మమ్మ, కూతురు పద్మజ శనక్కాయలు ముందువేసుకొని రెండు చేతులతోను అడపాదడపా నోటితోను వలుస్తున్నారు. వాళ్ల ఆత్రం చూసిన నారాయణకు నవ్వు వచ్చింది.

"ఏమే. మీరు అంత ఆత్రంగా వల్చినా ఎప్పటికి అయ్యేది. వొల్చి, చెరిగి, జల్లించి ఏరపించద్దా. రేపో మన్నాడో వాన పడేటిగా ఉండాది. వాన పడిందంటే దుక్కి చేయడం, ఎనకంటీనే గింజలు వెయ్యడం అయిపోవాల. మళ్ల వానపడుతుందో లేదో. ఈ అదునుకు ఏయలేదనుకో.. మల్ల ఏసినా లాబంలేదు" అన్నాడు నారాయణ తనూ వాళ్లతో చేరుతూ.

సుధాకర్ గొడ్ల మేపుకొనిరావడానికి వెళ్లాడు.

"యింగెట్ల చేద్దా" అంది లక్ష్మమ్మ చేస్తున్న పనిని ఆపకుండానే.

"మనమే వొల్చి యిత్తనానికి రెడీ చేసుకోవాలంటే పదిపద్దైదు రోజులు పడతాది.

దుడ్డుకు ఒలిపించినామనుకో బిన్నే పనయిపోతాది. పల్లో ఆడోళ్లు పిల్లోల్లు పనుల్లేక ఖాళీగా ఉండ్లా. ఒకేరోజులో ఒల్చేది అయిపోతాది. రెండుమూడు రోజుల్లో అమ్మాకూతుండ్లు జల్లించి ఏరపిద్దురు" అన్నాడు నారాయణ.

"అవునబ్బా, నువ్వు చెప్పింది నిజమే. మే పద్మా. మా చెనిక్కాయలు వొల్చేదానికి రాండని దిగవీధిలో వాళ్లకు చెప్పేసి రాపో" అంది లక్ష్మమ్మ.

పద్మజ పరుగున వెళ్లింది.

"అదేమే. దిగవీధిలో వాళ్లనే రమ్మన్నేవు, ఎగవీధిలో వాళ్లక్కూడా చెప్పితే బిన్నే అయ్యిండుగదా పని." అన్నాడు నారాయణ.

"ఆ మాత్రం తెలీదా. దిగవీధిలో వాళ్లు వచ్చేది ఎగవీధి దారింటీనే గదా. అందురూ ఏకంగానే వస్తార్లే." అంది లక్ష్మమ్మ.

పావుగంటకంతా ముప్పయిమందికి పైగా పోగయ్యారు. కొంతమంది నారాయణ యింటివద్దే కూర్చున్నారు. మిగిలిన వాళ్లకందరికీ తమ ఇంటికి ఎదురుగా ఉన్న రాములవారి గుడిలో కాయలు కుమ్మరించాడు నారాయణ. అందరూ వేరుశనగ కాయలు చకచకా వల్చసాగారు. శనక్కాయలు నేలకేసి కొడుతుంటే చిటపటమనే శబ్దం లయబద్ధంగా విన్పిస్తోంది. కాయలు అయిపోయినచోట కుమ్మరిస్తూ మరదలు వరసవాళ్లతో పరాచికాలాడసాగాడు నారాయణ.

ఆరేడు సంవత్సరాలలోపల వయసుగల పిల్లలు తమ తల్లులవద్దచేరి శనగ్గింజలకోసం మారాంచేయసాగారు. పందెంలో పాల్గొన్న వాళ్లలాగా వల్చడంతో సాయంకాలం ఐదుగంటలకంతా అయిపోయాయి. తాము వల్చిన కాయల్ను అందరాడవాళ్లు చెరగసాగారు. నారాయణకు అక్కడ పని లేకపోవడంతో వాళ్లకు కొంత దూరంగా వెళ్లి కూర్చొని బీడీ ముట్టించాడు. బీడీ తాగుతున్నాడేకానీ అతడ్ని ఆలోచనలు ఒక సంవత్సరం వెనక్కు లాక్కెళ్లాయి. గత సంవత్సరాన్ని మరచిపోవాలని ఎప్పుడూ ఆ అనుభవాలను గుర్తుకు తెచ్చుకోకూడదని ఎంతగా అనుకొన్నా అవి అంతకన్నా వేగంగా అతడ్ని వెన్నంటే వస్తున్నాయి. అందుకే అతడి ఆలోచనలు మరోమారు గతంలో చేరి గిరికీలు కొట్టసాగాయి.

❀ ❀ ❀ ❀ ❀

"నీకేం నారాయణ. బంగారట్లానేల. ఇట్లా ఎర్రనేల ఈ చుట్టుపక్కల ఊర్లల్లో ఎవ్వరికుండాది చెప్పు. అంతా ఒగేతావన ఉండాది. కష్టపడే భార్యాబిడ్డలు. అదృష్టమే" అంటూ పలకరించాడు రామిరెడ్డి.

"దీనికి ఎంతగా కష్టపడినామో నీకు తెలీదా రెడ్డీ. ఇదంతా ఎట్లున్నింది. మనుషులు తిరగలాడేటిగా ఉన్నిందా? అడివి మాదిర్తో ఉన్నిండ్లా. రెండు సంవత్సరాలు పట్టిందే సదరకట్టేలకు." అన్నాడు నారాయణ చేన్లో గడ్డిపీకడం ఆపి.

"కష్టపడిందానికే గదా.. సుఖపడతాండేది" అన్నాడు నవ్వుతూ రామిరెడ్డి.

"ఏమి సుఖమప్పా రామిరెడ్డి. చేనులేకముందు కూలికి పొయ్యేటప్పుడే మూడుపూటలా తింటాంటిమి. కంటారా నిద్రపోతాంటిమి. ఇది అరువుపన్నెప్పటినుంచి ఒగటే ఎసనం పట్టుకొనిందనుకో. చూడు రెడ్డి, ఎట్లుండాయో చెట్లు. అందురూ చెట్లు పెరకతాండారు. మాయ్యి చూడు" అంటూ వేరుశనగ చెట్లు చూపించాడు నారాయణ.

రామిరెడ్డి చేన్లో అటూ ఇటూ తిరిగి చూశాడు. రెండుమూడు చెట్లు పెరికాడు. వాటిని చేతిలో పట్టుకొనే "ఏమి నారాయణా ఈ మాదిర్తో ఉండాయే. కాయలు చెట్టుకు నాలుగైదు కూడాలేవు. అయ్యీ ముదిరిండ్లా." అన్నాడు ఆశ్చర్యంగా.

"ఏం చేసేది రెడ్డి. చిన్న పుశాలకార్తెలో అందర్తోపాటు ఎయ్యాలా. మల్లవాన ఎనక్కొట్టె. పెద్దపుశాల కార్తెగూడా పొయ్యినాంక ఏస్తి. ఈ మాదిర్తో అయ్యింది సేద్దిం. అన్నేయంగా దుడ్డంతా మట్టిలో కుమ్మరించినట్లాయ. ఇయ్యి ముదిరేలకు వానలు పడతాయో పడవో. భూమిలోంచి ఎట్ల ఎల్లదియ్యాల్నో ఏమో వీటిని." అంటూ నారాయణ తన దిగులును మాటల్లో వ్యక్తపరిచాడు.

"అదీ. అట్ల చెప్పుసంగతి. ఎనకేసే ఈ మాదిర్తో అయ్యిండేది. ఇంకొంచెం ముందుగా ఏసింటేనేమి?"

"ఏద్దామనే అనుకొంటి. కుదర్లా. మీ మాదిర్తో అన్నీ ఉండేవాళ్లమయితే అదునుకు సేద్దిం చేయనవతాది. మా బోటోళ్లకు అవతాదా?" అన్నాడు నారాయణ తమ ఆర్థిక స్థితిని చెప్పకనే చెబుతున్నట్లుగా.

"ఏం ఉండేటోళ్లమోలే నారాయణా. మాకు ఉండేది ఒగటే. మీకు లేంది ఒగటే. మాకన్నా మీరేనయం. ఈ సేద్యం నమ్ముకొని చస్తాండాము. మీరన్నా మీ బాధలు చెప్పుకొంటాండారు. మేము మా కష్టాలు చెప్తే పరువుపోతాదని గమ్మునుండాము. నేనుగూడా పదెకరాలు నీ మాదిర్తో ఎనకేసినా. అయ్యిగూడా ఇట్లా ఉండాయి. ఏం చేద్దాం. పైవాడ్ని నమ్ముకొందాం. అంతే. మన చేతల్లో ఏముంది. వస్తా మారేళ్లదాకా పొయ్యిరావాల" అంటూ వెళ్లిపోయాడు రామిరెడ్డి.

నారాయణ ఊహించినట్లుగానే ఆ సంవత్సరం కాయలు ముదిరేప్పటికి వర్షం రాలేదు. పక్క ఊర్లోంచి ట్యాంక్ తెప్పించి ఎద్దలబండితో నీళ్లుతోలి చెట్లు పీకారు. వాటిలో వచ్చిన దిగుబడి పంట పెట్టుబడికి అయిన ఖర్చులకు కూడా చాల్లేదు.

❁ ❁ ❁ ❁ ❁

"ఏంబా.. పొద్దు పోతాండాదా వస్తాండాదా? తీరిగ్గా కుచ్చోనుండావే. ఆడోళ్లంతా యిండ్లకు పొయ్యి అన్నాలు చెయ్యద్దా. అప్పుడే సరస్వతి కూతురు చూడు, ఏడుస్తాంది అన్నం కావాలని. బిన్నే వచ్చి కొల్చినావంటే వాళ్లు ఎలబారిపోతారు" అంటూ అరచింది లక్ష్మమ్మ.

ఆమె అరుపులతో వర్తమానంలోకి వచ్చిన నారాయణ అక్కడ్నుంచిలేచి, ఆరిపోయిన బీడీని జేబులో వేసుకొని తప్పట్లు చెరిగేసిన వాళ్ల గింజలు కొల్చసాగాడు. అతనికి కూతురుకూడా తోడయింది. పొద్దు గూట్లోపడి చీకట్లు ముసురుకొనేప్పటికి గింజలపని అయిపోయింది.

"ఇంట్లోకి గింజలయితే వచ్చినాయికానీ, ఎరువులకు, కూలీలకు దుడ్డు కావద్దా" అనే దిగులు పట్టుకుంది నారాయణకు. ఉన్న ఒకటిరెండు నగలు తాకట్టుకెళ్లి చాలా రోజులే అయింది. అప్పటికే చాలాచోట్ల అతను చేసిన అప్పులు వడ్డీల పిల్లలపెట్టి రోజురోజుకూ పెరుగుతున్నాయి. వయసెక్కువయిన కూతురికి పెళ్లిచేయడానికి తిరిగే వ్యక్తిలా కాళ్లరిగేలా తిరిగాడు నారాయణ. ఇంట్లో ఆడవాళ్లు శనగ్గింజలనుంచి మంచిపప్పు, నచ్చుపప్పు ఏరపించే కార్యక్రమంలో మునిగిపోయారు.

వారం రోజులకు వర్షం వచ్చింది. అప్పటికి భార్యాభర్తలు చేపట్టిన పనులు కూడా పూర్తయ్యాయి.

నారాయణ ఇంట్లో దున్నడానికి యిద్దరు మనుషులయితే ఉన్నారుగాని మడకలాగడానికి ఎద్దులు లేవు. ఉన్న ఎద్దులను ఎప్పుడో అమ్మేసి రెండు జెర్సీ ఆవులకొన్నాడు.

ఆ పల్లెలో రెండు ట్రాక్టర్లు ఉన్నాయి. ఒకటి నాయుడిది. మరొకటి అతని బావమరిదిది. మళ్లీ సకాలంలో వర్షం వస్తుందో రాదో అని అందరూ భయపడుతుండడంతో, ఎద్దుల కట్టి దున్నితే ఆలస్యమవుతుందని ట్రాక్టర్లకోసం ఎగబడ్డారందరూ. దాంతో వాటికి గిరాకీ పెరిగింది. ట్రాక్టర్లు ప్రస్తుతం క్షణం తీరికలేకుండా పనిచేయసాగాయి. వీళ్ల అవసరాన్ని గమనించిన నాయుడు గంటకు మూడువందల రూపాయలు తీసుకోసాగాడు.

"అదేం నాయుడు నిరుడు ఇన్నూట ముప్పయ్యే గదా" అని ఎవరన్నా అంటే "నేనేం కాదంటాండానా.. నిరుడు అంతకే తోలింది. ఈ సారి డీజల్ రేట్లు ఎట్ల పెరిగింది మీకు తెలుసుగదా. నేనేం చేసేదింగ" అన్నాడు నాయుడు లౌక్యంగా.

అవసరం వీళ్లది. వినక తప్పని స్థితి.

నారాయణకూడా అందరితో పోటీ పడ్డాడు. తను మనిషిననే విషయం మరచాడు. ఒకరేయి పగలు ట్రాక్టరువెంట కుక్కలా తిరిగాడు. వాళ్లడిగినవన్నీ గాడిదలా సరఫరా చేసి తన చేను దుక్కి చేయించుకొన్నాడు. చేన్లో చెమ్మ ఆరకముందే 'గోర్రు' తో గింజలు వేసాడు. గింజలు వేయడం పూర్తయిందాకా అతనికి మనశ్శాంతి లేదు.

అది మొదలు నారాయణ పొద్దున్నే నిద్రలేస్తూనే నేరుగా చేను వద్దకు వెళ్తాడు. చేనంతా కలయతిరుగుతాడు. యాడన్నా కంటికి చిన్నరాతి పలుకు కనిపించినా సరే... గెనంమీదకు విసరి కొడతాడు. మెరుపులా వచ్చి కురిసిపోయిన వానకు గెనాలమీద, బీళ్లలో పచ్చిక మిసమిసలాడుతూ పెరిగి పచ్చచీరలా కన్పిస్తోంది.

నాలుగోరోజుకూడా అలవాటు ప్రకారం నారాయణ సూర్యుడికన్నా ముందుగా పొలంవద్దకు వెళ్లాడు. మరో అర్ధగంటకంతా వెలుగు దారి పరచుకుంటూ సూర్యుడు తూర్పు కొండలపైకి ఎగబాకాడు. ఆ వెలుతుర్లో చేన్లో 'లెక్కలనోద్దు'లోని గీతల్లా చాలుగింజలు చాళ్లలో తలల్లేపుకొని దర్శనమిచ్చాయి మొలకలు. వాటిని చూస్తోంటే నారాయణ ఆనందానికి పట్టపగ్గాల్లేవు. ప్రతిచాలు కలయతిరిగాడు. ఏయే రకాలు మొలిచాయో చూశాడు. ఎక్కడయినా గింజలు మొలవకుండా తెరిపి కనిపిస్తే చూసి బాధపడ్డాడు. 'ఆ... నాచుగింజలయింటాయిలే నిదానంగా మొలుస్తాయి' అని తనకు తనే సర్ది చెప్పుకున్నాడు.

మరో మూడు రోజులు గడిచాయి. వేరుశనగ గింజలు మట్టి పెళ్లలను లేపుకొంటూ పైకి వచ్చాయి. అవన్నీ తనను చూడ్డానికి వచ్చిన దేవతా బాలల్లా కన్పించాయి నారాయణ కళ్లకు. చేనంతా మొలకలమీద పాదం పడకుండా జాగ్రత్తగా తిరిగాడు.

రోజులు చకచకా జరిగిపోతున్నాయి. నారాయణ రేయింపగలు పొలం వద్దనే కాలం గడుపుతున్నాడు. సుధాకర్ తమ ఆవులను పొలం గట్టుమీద, పక్కనే పచ్చిక ప్రాంతాల్లో మేపుకొంటూ తండ్రి ఆనందంలో పాలుపంచుకోసాగాడు.

గింజలు వేసి మూడువారాలు కావస్తున్నా వర్షం రాకపోవడంతో నారాయణ హృదయం బిక్కుబిక్కుమంటోంది. చెట్లన్నీ వాడుమొగం పెట్టాయి. అవేలోకంగా మసులుతున్న నారాయణ ముఖంకూడా వాడుమొగం పట్టింది. ఒకరోజురాత్రి నారాయణ గాఢనిద్రలో ఉండగా ధమధమా శబ్దం వచ్చింది. ఉలికిపాటుగా లేచి కూర్చున్నాడు. అది ఉరుముగా పోల్చుకున్నాడు. అప్పటికే బయట వర్షం సన్నగా కురుస్తోంది. నారాయణ పడకమీదనుంచి లేచి తలుపుతీసి బయటకొచ్చి వర్షంలో నిల్చొని ఆకాశంవైపు చూశాడు. ఆకాశం అవగింజంతకూడా కన్పించకుండా నల్లటిమబ్బులు. నారాయణ ఆనందంగా వచ్చి మంచంమీద కూర్చున్నాడు. వర్షం అంతకంతకూ పెరగసాగింది. నారాయణకు నిద్రరాలేదు. ఎప్పుడెప్పుడు పొలంవద్దకు వెళ్దామా అని ఉంది. ఉధృతంగా కురిసిన వాన గంటకంతా ఆగిపోయింది. రెండుపదున్లు పడుంటాది అనుకొన్నాడు. మిగిలిన రాత్రంతా అతనికి నిద్ర రాలేదు. తొలికోడి కూయగానే చేను వద్దకు వెళ్లాడు. వేరుశనగ చెట్లను తడిమిచూశాడు. తెల్లవారగానే వాటి పచ్చదనాన్ని చూసి తనూ పొంగిపోయాడు.

మరో రెండు వారాలకంతా దొంగపూత చెట్లనిండుకు పూసింది. గింజలువేసింది మొదలు వాటిలో జరిగే ప్రతి మార్పును నారాయణ తనలో జరుగుతున్న ఆనందకరమైన మార్పుగానే భావిస్తున్నాడు. ఎంతో సంతోషిస్తున్నాడు. ఆకుపచ్చని చేలల్లో పసుపుపచ్చని పూలు అతనికంటికి వినీలాకాశంలో తారల్లా కన్పిస్తున్నాయి.

సూర్యుడ్ని మింగడానికి వస్తున్న రాహువులా పెరుగుతున్న కలుపుమొక్కలను చూసి

అతనిలో ఎక్కడలేని కోపం పుట్టుకొచ్చింది. వెంటనే కూలీలను పెట్టి గుంటకల్తోలించాడు. మనుషుల పెట్టి 'తొలికల'తో తవ్వించాడు. తను దగ్గరుండి మనిషి మనిషికి పలుమార్లు చెప్పి ప్రతిచెట్టు మొదలు దగ్గర మట్టిని కుప్పగా తోయమన్నాడు.

మరికొన్ని రోజులు గడిచాయి. రాలిపోయిన దొంగపూత స్థానంలో మళ్లీ పూత రాసాగింది. నారాయణ ఒక చెట్టు మొదలువద్ద మట్టిని జాగ్రత్తగా తొలగించి చూశాడు. చెట్టుకు పాతికదాకా వూడగలు దిగాయి. అప్పుడే పంటంతా వచ్చినంతగా సంతోషించాడు నారాయణ.

దగ్గరి బంధువుల పెళ్లి ఉంటే కొడుకూ కూతుర్ని ఇంటిదగ్గరే పెట్టి, నారాయణ లక్ష్మమ్మ రెండురోజులు ముందుగానే వెళ్లి రెండురోజులు ఉండి వచ్చారు. ఇంటికి వస్తూనే మంచి నీళ్లయినా తాగకుండా పొలం వద్దకు వెళ్లాడు.

కలుపుమొక్కలు లేని చేను కళకళలాడుతుంటే, అంతకన్నా కళగా తిరుగాడుతున్న నారాయణ మది కలుక్కుమనేలా అతడ్ని ఒక దృశ్యం కట్టిపడేసింది. బాధ కోపంగా మారింది. వేరుశనగ చెట్టుమీద ఎర్రగొంగళి పురుగుచేరి స్వైర విహారం చేస్తోంది. ఆ పురుగును చెప్పుకాలితో పక్కకుతోసి కసిగా తొక్కాడు. రెండడుగులు వేయగానే మరో పురుగు దానినీ చంపాడు. మరో రెండడుగులు వేశాడు. ఇంకోపురుగు. చేనంతా గొంగళి పురుగులు. అంతః పురాన్ని అతలాకుతలం చేస్తున్న శతృసైనికుల్లా గొంగళిపురుగులు వేరుశనగ చెట్లను వాటియిష్టమొచ్చినట్లు తింటున్నాయి. నారాయణకు వాటిని చూస్తుంటే పుట్టలో జొరబడిన పాములను చూస్తున్నట్లుంది. అతన్లో ఒక విధమయిన అసహాయత కోపం ముప్పిరిగొన్నాయి. యింతలో పక్కచేన్లో నాగిరెడ్డి కన్పించాడు.

"నాగిరెడ్డీ... ఏందీ పురుగులు. మా చేన్లో ఇట్ల పన్నేయే." అన్నాడు నారాయణ.

"మీ చేనే కాదన్నా... మా చేన్లో గూడా ఉండాయి. మనచేన్లే కాదు. చానా చేన్లల్లో ఉండాయి. యాట్నించి వస్తాండాయో ఏమో, చీమల మాదిర్తో వస్తాండాయి. ఆ పక్క గొల్లపల్లెకల్లా అయితే ఒక్క ఆక్కూడా మిగల్నీకుండా తినేసినాయి. నేను మొన్న ఆపక్క పనుండి పోయింటి. ఆ మోటు చెట్లను చూస్తాంటే కడుపుకాలి పోతాందనుకో." అంటూ గొంగళి పురుగుల నిర్వాకాన్ని ఏకరువు పెట్టాడు నాగిరెడ్డి.

"ఆఁ... అయితే మనచేన్లూ అంతేనా" అడిగాడు నారాయణ భయంగా.

"అంతేగదా. దేవుడు దయతలచి ఇయ్యి ఎలబారి పోవాల్నేగాని మనం వాటినేం చేయలేమన్నా. ఎన్నని చంపతాం చెప్పు. ఇంగా నువ్వు ఆ పక్క పొయ్యి చూల్లా. ఒక్కో చెట్టుకు పదీపదైదు పురుగులుండాయి" అన్నాడతను.

నారాయణకు దిగులు పట్టుకుంది. ఆరోజు ఇంటికి వెళ్లాడేగాని అతని మనసు మనసులో

లేదు. రాత్రంతా పక్కమీద చాలా సేపు పొర్లాడు. బలవంతంగా కళ్లు మూసుకొన్నా నిద్రరాలేదు. తెల్లవారురుఝామున ఎప్పటికో నిద్రపట్టింది. నిద్రలో కలలో తనను చుట్టుముట్టిన గొంగళి పురుగులు. వందలు వేలున్నాయి. తను వాటిని ఎంతగా విదిలించాలని చూసినా అవి మరింత గట్టిగా పట్టుకుంటున్నాయి. ఉలికిపాటుగా లేచాడు నారాయణ. అది మొదలు అతనికి రాత్రుల్లో నిద్రలేకుండా పోయింది.

ప్రభుత్వం గొంగళి పురుగులను నిర్మూలించడానికి కొన్ని చర్యలు చేపట్టింది. అవి కంటితుడుపుగా మిగిలాయి తప్ప దుఃఖాన్ని కల్గిస్తున్న గొంగళిపురుగులను ఏమీ చేయలేకపోయాయి. తాము చూస్తుండగానే వేరుశనగ చెట్ల ఆకులనంతా తినేసి తమకు జీర్ణం కావనుకొనేమో కొమ్మలను వదిలేసి సుశిక్షితులైన సైనికుల్లా విసవిసా వెళ్లిపోయాయి పురుగులు. ఆకుల్లేని వేరుశనగ మొదుళ్లను చూస్తుంటే నారాయణ గుండెల్లో గునపం దిగబడినట్లు విలవిలలాడుతున్నాడు. వర్షం మళ్లీ పడింది. వర్షానికి మోడుచెట్లు చిగిరించసాగాయి. వాటితోపాటు నారాయణలో ఆశలూ చిగురించసాగాయి. పూడగలు దిగి కాయలు కాస్తాయని ఎంతో ఆశగా ఉన్నాడతను. ప్రతిరోజూ పొలం వద్దకు వెళ్లడం. వేరుశనగ చెట్లు కొత్తరెమ్మలతో, తనలో కొత్త ఆశలను నింపుతూంటే ఆనందించడం అలవాటయింది అతనికి.

రెమ్మలు పెరిగి మళ్లీ పూత పూసేప్పటికి నెలదాటింది. కలుపుమొక్కలు సంజీవని తాగినట్టు మళ్లీ పుట్టుకొచ్చాయి. వాటికి గుంటకల్తోలడానికి, తొగడానికి కూలీలకు అదనంగా నారాయణ చేతి చిలుం వదిలింది. నాలుగు నెలలకంతా వేరుశనగ చెట్లు పీకాల్సింది. ఎర్రగొంగళి పురుగుల పుణ్యమాని ఐదునెలలు పట్టింది. పూడగలు దిగడం ఒకనెల ఆలశ్యం కావడంతో చెట్టుకు మూడు నాలుగు కాయలకు మించి ఊరలేదు.

అదును తప్పింది. ఆఖరున వర్షం వస్తుందో రాదో అని అతని గుండె బితుకుబితుకు మంటోంది. రేపో మాపో వాన పడితే చెట్లు పీకడానికి సిద్ధంగా ఉన్నారంతా. ఒక వారం ఆలస్యంగా వచ్చింది వర్షం. మళ్లీ వర్షం వస్తుందో రాదో అని పోటీలమీద కూలీలు పెంచి పెరికించారంతా.

వాదులుగా వేసిన చెట్లను చూస్తోంటే నారాయణ కడుపుకాలిపోతోంది. శనగచెట్లకు ఎక్కువంటె ఐదుకాయలున్నాయి. కొన్ని చెట్లకు అస్సలు కాయలే లేవు. ఒక్కకాయ ఉన్న చెట్లు ఎక్కువగా ఉండాయి. వాదులుగా ఉన్న చెట్లన్నీ వాములుగా వేశారు. ఎవరి కాయల్ని వాళ్లే విడిపించుకోసాగారు.

లక్ష్మమ్మ, పద్మజ, సుధాకర వామి వద్ద కూర్చొని కాయలు విడిపించసాగారు. నారాయణ కూడా వాళ్లతో పాటు ఉన్నాడు. యాంత్రికంగా పనయితే చేస్తున్నాడు కాని అతని మనసు మనసులో లేదు. పుష్పవతయి రెండు సంవత్సరాలు దాటిన కూతురు అతని కండ్లకు భూతంలా

కన్పిస్తోంది. ఇరవై ఐదు సంవత్సరాలు నిండిన కొడుకు పెళ్లికాక అతనికి శిఖండిలా అన్పిస్తున్నాడు. శరీరంపై పిడికెడు కండగూడా లేని భార్య అతనికి అస్థిపంజరంలా కన్పిస్తోంది. తల విదిలించాడు. తన దుస్థితికి మనసులోనే దుఃఖించాడు.

'ఎందుకిలా జరుగుతోంది. తామెవరికి ద్రోహం చేశామని. వర్షం సకాలంలో కురిసినా ఎర్రగొంగళి పురుగులు తమనెందుకు పీడించాయి. పంట ఎప్పుడు బాగా వస్తుంది. అప్పులెప్పుడు తీరతాయి. కూతురుకు కొడుక్కు పెండ్లెప్పుడు చేస్తాడు' అని ఆలోచించసాగాడు. అతని ఆలోచనలు అవిశ్రాంతంగా సాగుతున్నాయి.

కొన్నిరోజులకు కాయలు విడిపించడం పూర్తయింది. వాటిని పల్లెదగ్గర బండమీదకు తోలి ఎండకు ఆర బెట్టారు. రెండోరోజుకంతా కాయలు బాగా ఆరిపొయ్యినాయి. సాయంకాలం సంచులకు వేస్తాండారు.

అప్పుడే అటుగా తమ పొలం వద్దకు వెళ్తున్న రామిరెడ్డి వీళ్ల వద్దకు వచ్చి కాయలు చేతికి తీసుకొనిచూసి "పిచ్చలట్లా కాయలు నారాయణా. పదిమూటలు యిత్తనానికి పెట్టుకో. మిగిలినోటియి అమ్ముకో" అన్నాడు.

"ఆడ ఏముండాయిలేన్నా, అమ్మేదానికి. యిత్తనాలకు సరిపోతాయేమో." అంది లక్ష్మమ్మ కాయలను చాటతో సంచుల్లోకి వేస్తూ.

"ఇరవై ఐదు మూటలుంటాయమ్మ. ఔటన్ ఎట్లుండాయని! రాళ్లమాదిర్తో ఉండాయి కాయలు. యిత్తనంకాయలు పెట్టుకో నారాయణా. మళ్లా అప్పటికి ఎవర్నీ దేబిరించే అవసరముండదు" అంటూ తన పొలం వద్దకు వెళ్లాడు రామిరెడ్డి.

అతనటు వెళ్లగానే నాయుడు వచ్చాడు బుజ్జాసాబ్‌తో. 'ఇస్తావా సస్తావా' అని కూర్చున్నాడు. పరువు ముఖ్యమని అన్నీ తూకం వేసేశాడు నారాయణ.

"మూట నాలుగు వందలే నారాయణ" అన్నాడు నాయుడు.

"అదేం నాయుడు, మాకు అమ్మేదానికయితే ఆరునూర్లా. మీరు కొనేదానికి నాలుగు నూర్లా" అన్నాడు ఆవేశంగా నారాయణ.

"అంతకోపమొద్దు నారాయణా. నేను నాలుగు నూర్లతో లెక్కతెంచేస్తా. ఇంగా పదిరోజులు పదితావల విచారించుకోనిరా. అంతకన్నా ఎక్కువ యాడన్నా ఉన్నిందంటే నేను మిగిలింది ఇచ్చేస్తా" అన్నాడు నాయుడు.

అందుకు ఇంక కాదనలేక పోయాడు నారాయణ.

చాలాచోట్ల విచారించి చూశాడు. ఎక్కడా నాలుగువందలకు మించిలేదు. కొనే వాళ్లంతా నాయుడు లాంటి వాళ్లే అనే విషయం అప్పుడు స్ఫురణకు రాలేదు నారాయణకు.

వారం తర్వాత నాయుడు ఇంటికి పోయి లెక్క చూడమన్నాడు. నాయుడు కాగితం

తీసుకొచ్చి లెక్కలేసి "వడ్డీ మొదలు కలిపి తొమ్మిదివేలా మూడునూర్లా అరవై అయింది. నియ్యి ఇరవై నాలుగు మూటల కాయలుగదా. వాటికి తొమ్మిదివేలా ఆరు నూర్లయింది. బాకీపోను ఇన్నూట నలభై రూపాయలు వస్తాది." అన్నాడు నాయుడు.

"వడ్డీ ఒగనెలదన్నా తగ్గించుకో నాయుడు. ఈసారి పంట బాగరాలా కదా" అడిగాడు నారాయణ

"పంట బాగరాకుంటే అందుకు నన్నేం చేయమంటావు చెప్పు. అయినా ఇదేమన్నా నాదుడ్డా. మా బామ్మర్దిది గదా. ఆరు నెలలమింద పదిరోజులు ఎక్కువయింది. దానికి నిన్ను వడ్డీ అడగలా" అంటూ తన ఔదార్యాన్ని చాటుకొన్నాడు నాయుడు.

మిగిలిన డబ్బు తీసుకొని ఇల్లు చేరాడు నారాయణ. తమ కష్టమంతా వృధా అయినందుకు నారాయణ దంపతులు చాలా బాధపడ్డారు. ఇంక తాము సేద్యమే చేయకూడదనుకొన్నారు. అందరూ కూలికి వెళ్లసాగారు.

ఆరు నెలలు గడిచాయి. తొలి ముంగార్ల వానలు ప్రారంభమయ్యాయి. అందరూ చేన్లు దుక్కి చేయసాగారు. పొలం జోలికి వెళ్లని నారాయణతో తమ పక్క పొలం నాగిరెడ్డి కలిసి, "ఏమన్నా.. ఈసారి గమ్మునుండావే. గింజలెయ్యవా?" అనడిగాడు.

"ఏందో నాగిరెడ్డి. గింజలెయ్య బుద్దికాలా. ఎన్నిసార్లు ఏసేది. నష్టపొయ్యేది. నిరుడు వానలు బాగా కురిసినా బొచ్చుపురుగులు పంటంతా నాశనం చేసేశ. ఈసారి మళ్లా వచ్చినాయనుకో మన కష్టమంతా బీటికే గదా. అందుకే గింజలు ఎయ్యగూడదనుకొన్నే. నీ బోటోళ్లు ఏస్తే కూలి పన్లకు వస్తాం" అన్నాడు నిరాశగా నారాయణ.

"ఈసారి ఆ దిగులేం వదన్నా, గవుర్మెంటు దానికి మందు కనిపెట్టింది."

"ఏం మందు"

"మందంటే మందుగాదు, వానలకు ఇప్పుడు రెక్కలపురుగులు వస్తాయిగదా. అయ్యిపెట్టే గుడ్లనుంచి బొచ్చుపురుగులొస్తాయంట. తొలీగా వానలు పడేటప్పుడే రాత్రుల్లో చేన్లకాడికి పొయ్యి పెద్దమంట ఏసినామంటే అయ్యన్నీ వచ్చి మంటలో పడి చస్తాయంట. మళ్ల బొచ్చు పురుగులు వచ్చేదే ఉండదంట." అన్నాడు నాగిరెడ్డి ఉత్సాహంగా.

"నిజంగానా" అడిగాడు అపనమ్మకంగా నారాయణ.

"నిజంనా, నీతో నేనెందుకు అబద్ధం చెప్తాను. ఒగేళ ఒగటి రెండు పురుగులు మిగిలి గుడ్లు పెట్టి మళ్లా వచ్చినాయనుకో, జిల్లేడు కొమ్మలుండలా. అయ్యి కొట్టుకోని పోయి చేన్లో ఏస్తే యాడుండే బొచ్చు పురుగులు దానికి ఎక్కతాయంట. దాన్ని దూరంగా తీసకపోయి కాల్చేస్తే వాటి పీడ ఆడికి పోతాది" అన్నాడు మరింతగా వివరిస్తున్నట్లుగా.

"ఇదేదో తమాసాగా ఉండాదే."

"తమాసా గాదన్నా. నిజం. మనమందరం ఈరోజు రాత్రికి మనచేన్ల కాడికి పొయ్యి మంటలేసి పురుగులు కాల్చేసి వద్దాం. సందేళ మళ్లా వస్తాన్నా" అనేసి వెళ్లిపోయాడతను.

అతనటు వెళ్తూనే నారాయణ ఒక్కక్షణం కూడా ఇంటివద్ద నిలవలేదు. నేరుగా నాయుడు ఇంటికి పోయాడు.

అతడ్ని రెండుగంటలు బ్రతిమలాడింతర్వాత బస్తాకాయలు ఆరువందలా యాభై లెక్కన యివ్వడానికి అంగీకరించాడు. తూకం వేసేప్పుడు గమనించాడు నారాయణ, ఆకాయలు తమవే అనే విషయం. తాము అమ్మింది నాలుగువందలు, కొంటున్నది ఆరువందలా యాభై. నారాయణలో కోపం పెల్లుబికింది. కానీ అతడి మనసును దాటి బయటకు రాలేదది. బుజ్జూసాబ్ తన ధోరణిలో తూకం వేస్తున్నాడు. అతని తూకాన్ని చూసి నాయుడు గుంభనంగా నవ్వుతున్నాడు...

అమెరికా భారతి - మార్చి ఏప్రిల్, 2002
కథా వార్షిక 2002